

పంచాయతీగా ఏర్పడితే సమస్యల నుంచి విముక్తి కలుగుతుందని ఆశ పడిన ఆ గ్రామాలకు నిరాశే ఎదురైంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నికలు జరిగి కొత్త పాలక వర్గంతో రాష్ట్రంలో అన్ని పంచాయతీలూ అభివృద్ధి పథం పడితే.. టీడీపీ నాయకులు కోర్టుకెళ్లడంతో ఆ గ్రామాలకు మాత్రం శాపమైంది. నిధులేమితో అభివృద్ధి కుంటుపడింది. మరో వైపు 15వ ఆర్థిక సంఘం నిధులు సైతం వెనక్కి వెళ్లిపోయాయి. దీంతో కష్టాలు ఎప్పుడు తీరుతాయి దేవుడా అని రాంబిల్లి మండలంలో కొత్తగా ఏర్పడిన అప్పారాయుడుపాలెం, మన్యపు చింతువా పంచాయతీలతో పాటు పాత పంచదార్ల, జెడ్ చింతువా పంచాయతీల ప్రజలు నిట్టూరుస్తున్నారు.

అభివృద్ధిపై.. నీలినీడలు!



కొత్తగా ఏర్పడిన అప్పారాయుడుపాలెం పంచాయతీ


అప్పారాయుడుపాలెం గ్రామానికి వెళ్లే రోడ్డు దుస్థితి


భోగాపురంలో అస్తవ్యస్తంగా చెత్తచెదారం

- రాంబిల్లి మండలంలో పలు పంచాయతీలకు విభజన శాపం
- టీడీపీ నాయకులు కోర్టుకెళ్లడంతో ఆగిన 4 పంచాయతీల ఎన్నికలు
- పాలకవర్గాలు ఏర్పడక 8 గ్రామాల్లో కుంటుపడిన అభివృద్ధి
- వెనక్కి వెళ్లిపోయిన 15వ ఆర్థిక సంఘం నిధులు
- సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని స్థితిలో ప్రజలు


వెంకయ్యపాలెం గ్రామంలో కాలువలు లేక రోడ్లపై మురుగునీరు

శోధిస్తున్న సమస్యలు

పంచాయతీలకు నిధులు లేక అభివృద్ధి జాడ లేకుండా పోయింది. గ్రామాల్లో వీధి లైట్లు సైతం ఏర్పాటు చేసుకోలేని పరిస్థితి నెలకొంది. కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. దోమలు పెరిగిపోయాయి. ఎక్కడి చెత్త అక్కడ పేరుకుపోవడంతో పారిశుధ్యం పడకేసింది. జలజీవన్ పథకం ద్వారా మంజూరయ్యే ఇంటింటి కుళాయిలు వేయకపోవడంతో తాగునీటికి ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. విభజన జరిగిన పంచాయితీలలో ఇంటి పన్నులు ఆయా పంచాయతీల పేరు మీద కట్టించుకున్నా ఫలితం లేకుండాపోయిందని, ఆదాయం రావడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. విభజన జరిగిన పంచాయతీలకు ప్రత్యేకంగా పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలు, పారిశుధ్య కార్మికుల నియామకం సైతం జరగలేదు. దీంతో ఏ సమస్య తలెత్తినా ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని స్థితిలో ఆయా గ్రామాల ప్రజలు ఉన్నారు. పంచాయతీలకు ఎన్నికలు జరిగితే తప్పా తాము ఏమీ చేయలేమని సంబంధిత అధికారులు ప్రజలకు చెబుతుండడం గమనార్హం. ఇప్పటికైనా పంచాయతీలకు ఎన్నికలు జరిగేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


వంతెన లేక గెడ్డలో నడుచుకుంటూ వెళ్తున్న ప్రజలు

రాంబిల్లి(యలమంచిలి): పంచాయతీల పునర్విభజన రాంబిల్లి మండలంలో 8 గ్రామాలకు శాపంగా మారింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీలు అభివృద్ధి పథంలో పయనిస్తుంటే.. రాంబిల్లి మండలంలో కొత్తగా ఏర్పడిన అప్పారాయుడుపాలెం, మన్యపు చింతువా పంచాయతీలు మాత్రం పాలకవర్గాలు లేక తిరోగమనం దిశగా పయనిస్తున్నాయి. విభజన సక్రమంగా జరగలేదంటూ ఆయా గ్రామాల టీడీపీ నాయకులు కోర్టుకు వెళ్లడంతో పంచాయతీలకు ఎన్నికలు జరగకపోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాక అభివృద్ధి కుంటుపడిపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జనాభా ప్రాతిపదికన భౌగోళికంగా విస్తీర్ణంలో ఎక్కువగా ఉన్న పెద్ద పంచాయతీలను విభజన చేసుకోవడానికి అవకాశం కల్పించింది. అలా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో పెద్ద పంచాయతీలుగా ఉన్న వాటిని రెండుగా చాలా చోట్ల విభజించారు.

రాంబిల్లి మండలంలో ఇలా..

మండలంలో జనాభా ప్రాతిపదికన అధికంగా ఉన్న పంచదార్ల, జెడ్.చింతువా పంచాయతీలలో 8 శివారు గ్రామాలు కలిసి ఉన్నాయి. వీటిలో పంచదార్ల పంచాయతీలో ఉన్న గ్రామాలు పంచదార్ల, ధారపాలెం ఒక పంచాయతీ, భోగాపురం, అప్పారాయుడుపాలెం గ్రామాలను కలిపి ఒక కొత్త పంచాయతీగా, అలాగే జెడ్.చింతువా పంచాయతీలో ఉన్న గజరెడ్డిపాలెం, లోవపాలెం, వెంకయ్యపాలెం ఒక పంచాయతీ, కొండవారపాలెం, నేవీ కాలనీ కలిసి ఎం.చింతువా ఒక పంచాయతీగా విభజన జరిగింది. ఈ విభజన సక్రమంగా జరగలేదంటూ ఆయా గ్రామాలకు చెందిన కొందరు టీడీపీ నాయకులు కోర్టుకు వెళ్లడంతో ఈ నాలుగు పంచాయతీలకు ఎన్నికలు జరగలేదు. దీంతో గత ప్రభుత్వ హయాంలో కొత్తగా ఏర్పడిన పంచాయతీలు అన్ని అభివృద్ధి పథంలో నడుస్తుంటే.. ఎన్నికలు జరగకుండా ఉండిపోయిన ఈ గ్రామాల్లో అభివృద్ధి పనులు సాగక దుర్భరమైన స్థితిలో ఉన్నాయి. పంచదార్ల, జెడ్.చింతువా పంచాయతీల విభజన జరిగి సంవత్సరాలు గడిచినా కొత్త పాలకవర్గాలు కొలువుదీరలేదు. దీంతో 15వ ఆర్థిక సంఘం నిధులు సైతం వెనక్కి వెళ్లిపోయాయి.

15వ ఆర్థిక సంఘం నిధులు వెనక్కి

రాంబిల్లి మండలంలో ఉన్న పంచదార్ల, జెడ్.చింతువా పంచాయతీలు నాలుగు పంచాయతీలుగా విభజన జరిగింది. అయితే విభజనపై కోర్టులో వివాదం నడుస్తోంది. దీంతో ఆయా గ్రామాల్లో ఎన్నికలు జరగలేదు. పాలకవర్గాలు ఏర్పడకపోవడంతో 15వ ఆర్థిక సంఘం నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. పంచాయతీలకు ఎన్నికలు జరిగితేనే నిధులు వస్తాయి.

– సన్యాసిరాజు, ఈవోపీఆర్‌డీ, రాంబిల్లి మండలం

సమస్యలు ఎవరికి చెప్పుకోవాలి



పంచాయతీలకు ఎన్నికలు జరగకపోవడంతో అభివృద్ధి ఆగిపోయింది. గ్రామాల్లో విధుల్లో విద్యుత్ దీపాలు వెలగడం లేదు. రాత్రి పూట చీకటిలో నడిచి వెళ్లాలంటే జనం భయపడుతున్నారు. చెత్త పేరుకుపోయి కాలువలు కంపుకొడుతున్నాయి. గ్రామంలో సమస్యలను ఏ అధికారి, ఏ ప్రజాప్రతినిధికి చెప్పుకోవాలో తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజా సమస్యలు తీరాలంటే పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలి.

– కారె త్రినాథ్, వెంకయ్యపాలెం గ్రామం

గ్రామాల్లో రహదార్లు, కల్వర్టులు నిర్మించాలి



కొత్తగా ఏర్పడిన అప్పారాయుడుపాలెం పంచాయతీకి ఎన్నికలు జరగకపోవడంతో సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారు. గతంలో వేసిన రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. మా గ్రామ సమీపంలో దొంగ గెడ్డ ఉంది. ఆ గెడ్డ వర్షాలకు ఉధృతంగా ప్రవహిస్తుంది. ఆ గెడ్డ మీద వంతెన నిర్మించాలని అధికారులను, ప్రజాప్రతినిధులను ఎన్నిసార్లు కోరినా పట్టించుకోవడంలేదు. దీంతో ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కొత్తగా ఏర్పడిన మన్యపు చింతువా, అప్పారాయుడుపాలెం, జిరాయితీ చింతువా, పంచదార్ల పంచాయతీల్లో సమస్యలు కోకొల్లలు. తక్షణం ఆయా గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలి.

– తేటకల లోవరాజు, అప్పారాయుడుపాలెం గ్రామం

ఎన్నికలు జరిగితేనే అభివృద్ధి



కొత్త పంచాయతీలకు ఎన్నికలు జరిగే పాలకవర్గాలు ఏర్పడతాయి. అప్పుడు వారంతా అభివృద్ధిపై దృష్టి పెడతారు. పాలకవర్గాలు లేకపోవడంతో గ్రామంలో అధికారుల పర్యవేక్షణ కొరవడింది. పంచాయతీలకు నిధులు రాక అభివృద్ధి పనులు నిలిచిపోతున్నాయి. దీంతో గ్రామంలో మౌలిక వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండడం లేదు.

– ధూళి రమణ, వైఎస్సార్‌సీపీ నాయకుడు, భోగాపురం

క్లుప్తంగా

పాఠశాలల వద్ద పెట్రోలింగ్ చేయాలి

పాయకరావుపేట: పట్టణంలో పాఠశాలలు, కళాశాలలు విడిచిపెట్టే సమయంలో పోలీసులు పెట్రోలింగ్ చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు సోమవారం స్థానిక ఏఎస్ఐ దొరకు వినతి పత్రం అందజేశారు. ఆ సమయంలో కొంత మంది మాదకద్రావ్యాలు సేవించి విద్యార్థినులను ఇబ్బంది పెడుతున్నారని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. అటువంటి సంఘటనలు జరగకుండా సాయంత్రం సమయంలో పాఠశాలలు విడిచిపెట్టేటప్పుడు పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.బాలాజీ, ఎం.రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఇంధనం పొదుపు అవసరం


గీసిన చిత్రాలతో విద్యార్థులు

మునగపాక: ప్రతి ఒక్కరూ ఇంధనాన్ని పొదుపు చేసుకోవాలని విద్యుత్ శాఖ ఈఈ రామకృష్ణ కోరారు. మండలంలోని నాగులాపల్లి ప్రాథమిక పాఠశాలలో ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో విజేతలకు సోమవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యుత్ ఆదా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ సురేష్, ఏఈ గోపీ, ఆ శాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు


పాటిపల్లిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

మునగపాక: ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు హెచ్చరించారు. మండలంలోని పాటిపల్లి రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 100/7లోని 75 సెంట్ల పోరంబోకు భూమి ఆక్రమణకు గురైనట్లు గుర్తించిన ఆయన సోమవారం సిబ్బందితో వెళ్లి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఎవరైనా ప్రభుత్వ భూములను ఆక్రమించాలని చూస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

మునగపాక: మునగపాక గ్రామంలో ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఓ వృద్ధుడు ఆదివారం రాత్రి మృతి చెందారు. ఎస్ఐ ప్రసాదరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మునగపాకకు చెందిన టెక్కలి నూకరాజు(64)వ్యవసాయం సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పేటకట్టు ప్రాంతంలో నిర్మిస్తున్న కొత్త మహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి గోతులు తవ్వారు. ఈ నెల 18న నూకరాజు ప్రమాదవశాత్తూ ఈ గోతిలో పడిపోవడంతో ఇనుప చువ్వలు తలకు గుచ్చుకుపోయాయి. దీంతో అతనిని విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందారు. ఈ మేరకు మునగపాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు నూకరాజుకు భార్య, కుమారుడు ఉన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి

మునగపాక: ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో సోమవారం ఆమె అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రజలు నేరుగా తమ సమస్యలు చెప్పుకునేందుకు ఈ వేదిక దోహదపడుతుందన్నారు. మండల స్థాయి అధికారులు తమ శాఖాపరమైన సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మానస, మండల ఇంజనీరింగ్ అధికారి గులామ్, సూపరింటెండెంట్ ప్రసాద్,విద్యుత్‌శాఖ ఏఈ గోపీ, ఈవోఆర్డీ సోమరాజు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

నేడు రెవెన్యూ సదస్సు

మునగపాక: మండలంలోని నాగులాపల్లిలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయ ప్రాంగణంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ సదస్సును రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాలికల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి


యలమంచిలి ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీవో ఇందిరాదేవి


శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీవో శ్రీవిద్య

యలమంచిలి రూరల్: బాలికల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఐసీడీఎస్ సీడీపీవో ఇందిరాదేవి, పట్టణ ఎస్ఐ కె.సావిత్రి, ఎంఈవో-1 వై.మీనాక్షి సూచించారు. సోమవారం యలమంచిలి పట్టణం, డల పరిధిలో కిశోరి వికాసం శిక్షకుల శిక్షణా తరగతులు వేర్వేరుగా జరిగాయి. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణ, మండల పరిషత్ మీటింగ్ హాల్‌లో జరిగిన శిక్షణా తరగతుల్లో కిశోర వికాసం లక్ష్యాన్ని వివిధ శాఖల అధికారులు వివరించారు. బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులు, బాల్య వివాహాలు, చదువు మధ్యలో మానేయడం వంటి వాటిని ఎదుర్కొనే మార్గాల గురించి బాలికలకు అవగాహన కల్పించినప్పుడే కిశోరి వికాసం కార్యక్రమం లక్ష్యం నెరవేరుతుందన్నారు. అంతకు ముందు కిశోరి వికాసం పోస్టర్లను ఆవిష్కరించి, ప్రతిజ్ఞ చేయించారు. మహిళా స్త్రీశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 అరుణ్‌కుమార్, జిల్లా బాలల హక్కుల పరిరక్షణ కమిటీ ప్రతినిధి డి.లోవరాజు, ఎంపీడీవో కొండలరావు, డిప్యూటీ తహసీల్దార్ వినయ్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు బీబీ సుహాసిని, రాణి, పైడికొండ, మీరాబీ, మెప్మా, మున్సిపల్, గ్రామీణాభివృద్ధి, పోలీసులు, సచివాలయాల సంక్షేమాధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పాయకరావుపేట: కిశోర బాలికలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ పీవో కె.శ్రీవిద్య కోరారు. కిశోరి వికాసంపై మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం శిక్షకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మానసిక అభివృద్ధి, బడికి వెళ్లే పిల్లల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. ఎంఈవో రమేష్‌బాబు, ఎంపీడీవో జయప్రకాష్‌రావు మాట్లాడుతూ కిశోర బాలికల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సౌజన్య, నిషా, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీలు, మహిళా పోలీసులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి


రైతులకు సూచనలిస్తున్న ఏవో మోహన్‌రావు

యలమంచిలి రూరల్: వాయుగుండం వల్ల ఏర్పడిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో మండలంలోని రైతులంతా అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారి పాలిమేర మోహన్‌రావు సూచించారు. సోమవారం యలమంచిలి పట్టణం సహా మండలంలోని పలు లోతట్టు ప్రాంతాల్లోని వరి పొలాలను ఆయన పరిశీలించారు. అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వరి కోతలను వీలైనంత వరకు వాయిదా వేసుకోవడం, ఇప్పటికే కోసిన వాటిని కుప్పలుగా పెట్టుకోవడం, నూర్పులు వాయిదా వేసుకోవడం చేయాలన్నారు. వరి కుప్పలపై టార్పాలీన్లను వేసి భద్రపరుచుకుంటే మంచిదన్నారు. తడిచిన వరి పనలపై ఉప్పు ద్రావణం పిచికారీ చేస్తే నష్టం తగ్గించుకోవచ్చన్నారు. వ్యవసాయ సహాయకులు రాంబాబు, గణేష్, మహేష్, రైతులు పాల్గొన్నారు.

అశ్వ వాహనంపై ఆపద్బాంధవుడు


అశ్వ వాహనంపై స్వామివారిని తిరువీధి సేవలకు తీసుకెళ్తున్న అర్చకులు

నక్కపల్లి: ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస అధ్యయనోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామిని అశ్వ వాహనంపై తిరువీధుల్లో ఊరేగించారు. ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు నిత్యార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. కొండ దిగువ క్షేత్ర పాలకుడు వేణుగోపాలస్వామికి, స్వామివారి ఉత్సవమూర్తులకు, గోదాదేవి అమ్మవారికి నిత్య పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం ఉభయ దేవేరులతో కూడిన స్వామివారిని అశ్వ వాహనంపైన, గోదాదేవి అమ్మవారిని పల్లకిలో ఉంచి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. అనంతరం గోదాదేవి అమ్మవారి సన్నిధిలో తిరుప్పావై పాశురంతో నీరాజన మంత్రపుష్పాలు, ప్రసాద నివేదన, తీర్థగోష్టి జరిగాయి. ఆలయంలో ప్రధానార్చకుడు గొట్టుముక్కల వరప్రసాద్ భగవద్గీత పారాయణ చేశారు.

ఘనంగా గణిత దినోత్సవం



చిత్రలేఖనం పోటీలో గెలుపొందిన విద్యార్థులు

కోటవురట్ల: జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా పాములవాక జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి డిసెంబర్ 22 కావడంతో అదే రోజున జాతీయ గణిత దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని హెచ్ఎం కె.వి.లక్ష్మీనారాయణ తెలిపారు. శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

మహిళలు ఆర్థిక సుస్థిరత సాధించాలి

మునగపాక: మహిళలు ఆర్థిక సుస్థిరత సాధించాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి కోరారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం జరిగిన మండల మహిళా సమాఖ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు సంఘాలు దోహదపడతాయన్నారు. సంఘాలను బలోపేతం చేసుకోవాలన్నారు. బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకొని అధిక ఆదాయం పెంచుకునే మార్గాలపై దృష్టి సారించాలన్నారు. ఏపీఎం బాలరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలువురు సీసీలు, సీఏలు, ఓబీలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనలతో ఉపాధ్యాయుల ఇబ్బందులు


చినగుమ్ములూరు పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘువర్మ

ఎస్.రాయవరం: ఉపాధ్యాయులకు ఇబ్బందిగా మారిన ప్రభుత్వ నిబంధనలు వెనక్కి తీసుకోవాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘువర్మ కోరారు. మండలంలో పలు గ్రామాల్లో ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ నాయకులతో కలిసి సోమవారం పర్యటించి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడారు. సీబీఎస్ఈ సిలబస్‌తో కూడిన విద్యా విధానాన్ని రద్దు చేసి, స్టేట్ సిలబస్‌ను పునరుద్ధరించాలన్నారు. జీవో నంబర్ 117ను రద్దు చేయాలన్నారు. అనంతరం పలు సమస్యలపై ఉపాధ్యాయులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.కె.ఎల్.ఎన్.ధర్మారావు, మండల శాఖ అధ్యక్షుడు సునీల్, ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొన్నారు.

27న విద్యుత్ చార్జీల బాదుడుపై నిరసన


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు

యలమంచిలి రూరల్: విద్యుత్ చార్జీల బాదుడుపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 27న చేపట్టబోయే నియోజకవర్గ స్థాయి నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు కోరారు. సోమవారం ఆయన యలమంచిలిలో మీడియాతో మాట్లాడారు. పట్టణంలోని పార్టీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి నిరసన తెలియజేసి, అధికారులకు వినతిపత్రం ఇవ్వనున్నట్టు తెలిపారు. ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే కరెంటు చార్జీల పెంపు ఉండదని చెప్పిన చంద్రబాబు మాట తప్పారన్నారు. చార్జీల భారం ప్రజలు మోయలేక పోతున్నారన్నారు. కేవలం ఆరు నెలల్లోనే కూటమి ప్రభుత్వం ప్రజల విశ్వాసం కోల్పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు బొద్దపు ఎర్రయ్యదొర, దూది నర్సింహమూర్తి, అంకిరెడ్డి నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మేలుకొలుపు


కె.వెంకటాపురంలో మేలుకొలుపు


హరిపాలెం అందలాపల్లిలో ..

కోటవురట్ల: కె.వెంకటాపురంలో మేలుకొలుపు కార్యక్రమాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు రామాలయంలో పూజలు చేసి దీపారాధన చేశారు. అనంతరం దేవుడి చిత్రపటాలు పట్టుకుని వీధుల్లో సంకీర్తన చేశారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఎంపీటీసీ సభ్యురాలు కాళ్ల రత్నం, భక్తులు గొల్లు చిట్టిబాబు, పైల శ్రీరామమూర్తి, మహిళలు పాల్గొన్నారు.

అచ్యుతాపురం: మండలంలోని హరిపాలెం అందలాపల్లిలో సోమవారం తెల్లవారు జామున మేలుకొలుపు నిర్వహించారు. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం భజనలు చేసుకుంటూ ఇంటింటికి వెళ్లి మేలుకొలుపు గీతాలు పాడారు. ఈ సందర్భంగా సమరసతా సేవా ఫౌండేషన్ సబ్ డివిజన్ కన్వీనర్ బి.వి.రమణ మాట్లాడుతూ ధనుర్మాసంలో దేవతలు భూసంచారం చేస్తారని, బ్రహ్మ ముహూర్తంలో లేచి భగవంతుని నామస్మరణ చేయడం ద్వారా వేయి ఏళ్ల పూజా ఫలం దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ధర్మ ప్రచారకులు కొల్లి అప్పారావు, మోహన్ రావు, రమణ అప్పారావు, గాంధీ, సూరప్పారావు, సన్యాసిరావు, వెంకునాయుడు, భవానీ, ఆదిలక్ష్మి, రమణకుమారి, వెంకటేశ్వరరావు, గాంధీ, పంతులు పాల్గొన్నారు.

'వెంటనే రెవెన్యూ సమస్యలకు పరిష్కారం'


చినదొడ్డిగల్లు సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ నర్సింహమూర్తి


అరబుపాలెంలో రెవెన్యూ సదస్సులో పాల్గొన్న అధికారులు

నక్కపల్లి: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలకు వెంటనే పరిష్కారం చూపుతున్నట్టు తహసీల్దార్ నర్సింహమూర్తి తెలిపారు. సోమవారం చినదొడ్డిగల్లులో రెవెన్యూ సదస్సులో పలువురు రైతులు ఆన్‌లైన్, వెబ్ ల్యాండ్, పాసు పుస్తకాలు, సరిహద్దు సమస్యలపై దరఖాస్తులు అందజేశారు. వాటిని అక్కడికక్కడే ఆన్‌లైన్ చేశారు. సదస్సుల్లో వచ్చిన అర్జీలను సమగ్రంగా విచారణ చేసిన 15 రోజుల్లోగా పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు. రెండు పర్యాయం నిర్వహించే రెవెన్యూ సదస్సుల నాటికి సమస్యలను పూర్తిగా పరిష్కరించాలని, ప్రజలకు జవాబుదారీగా ఈ సదస్సులు ఉండాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఈ సదస్సుల్లో వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, సర్పంచ్ చంద్రరావు, ఆర్ఐ కన్నబాబు, డీటీ అన్నాజీరావు, తదితరులు పాల్గొన్నారు.

మునగపాక: రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు కోరారు. మండలంలోని అరబుపాలెం సచివాలయ ప్రాంగణంలో సోమవారం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో ఆయన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల భూములకు సంబంధించి ఎటువంటి వివాదాలకు తావు లేకుండా పరిష్కరించుకునేందుకు ఇటువంటి సదస్సులు దోహదపడతాయన్నారు. గతంలో నిర్వహించిన రీ-సర్వేలో లోపాలను సవరించేందుకు అవకాశం ఉంటుందన్నారు. సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు, రీ-సర్వే డీటీ పడాల్, వీఆర్‌ఏ శాంతి, పలువురు రైతులు పాల్గొన్నారు.